క్లుప్తంగా

కుక్కలు, పందుల నివారణకు చర్యలు తీసుకోండి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న రామారావు

పాల్వంచ: కేటీపీఎస్ కాలనీల్లో వందల సంఖ్యలో కుక్కలు, పందులు గుంపులుగా సంచరిస్తూ కాలనీ వాసులపై దాడి చేస్తున్నాయని తక్షణం చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రామారావు అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. కాలనీలోని ఖాళీ స్థలాల్లో పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన కమిషనర్ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వెంపటి వెంకటేశ్వర్లు, యర్లగడ్డ ప్రసాద్, టి.గోపయ్య, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న పద్మ

ఇల్లెందు: పట్టణంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో కంటి వెలుగు శిబిరాన్ని 13వ వార్డు కౌన్సిలర్ కడకంచి పద్మ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సర్వేంద్రియానాం నయనం ప్రధానం అని మనపెద్దలు గతంలోనే చెప్పారని గుర్తుచేశారు. శరీరంలో కంటికి అంతటి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ శిబిరంలో కంటి వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మున్వర్, కౌన్సిలర్లు తోటలలిత శారద, సందబిందు, చీమల సుజాత, పాటోలు స్వాతి, పత్తి స్వప్న పాల్గొన్నారు.

ఆనందరావుకు సన్మానం



ఆనందరావును సన్మానిస్తున్న ఉద్యోగులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో వివిధ హోదాలలో విధులు నిర్వహించిన జీఎం పర్సనల్ ఐఆర్‌అండ్‌పీఎం అనందరావు మంగళవారం ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా మంగళవారం కమ్యూనికేషన్ సెల్ విభాగం వారు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ ఏజే మురళీధర్ రావు, అల్లిశంకర్, సాయికృష్ణ పాల్గొన్నారు. అదేవిధంగా ఐఆర్, పీఎం, ఈఆర్‌పీ, సీఎండీ పేషీ, విభాగాల ఏజీఎం పర్సనల్‌లు, పర్సనల్ మేనేజర్లు, డీవైపీఎంలు, సీనియర్ పీఓలు, ఇతర అధికారులు, సిబ్బంది సింగరేణి ప్రధాన కార్యాలయ ఆవరణలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏజీఎం పర్సనల్ కవితానాయుడు, డీజీఎం పర్సనల్ అజయ్‌కుమార్, పర్సనల్ మేనేజర్ ఎస్‌వీ రావు, వరప్రసాద్, వైపీఎల్ వరప్రసాద్, ఈవైపీఎం సీహెచ్ అశోక్, సీవీవీఎస్ మూర్తి, సీనియర్ పీఓలు రాము, సత్యనారాయణ, అనిల్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం తండ్లాట

ఏజెన్సీ గ్రామాల్లో తాగునీటి ముప్పు ముంచుకొచ్చింది. క్రమంగా భూగర్భజలాలు పడిపోతున్నాయి. సాధారణంగా ఏప్రిల్, మే నెలలో నీటి ఇబ్బందులు ఉంటాయి. కానీ మార్చి ప్రారంభంలోనే తాగునీటి ఎద్దడి నెలకొంది. అటవీ ప్రాంతంలో జీవనం సాగిస్తున్న ఆదివాసీ గిరిజనులు తాగునీటి కోసం గోస పడుతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. కిలోమీటరు దూరం కాలినడకన వెళ్లి కలుషితమైన చెలిమ నీటిని తెచ్చుకుని దాహం తీర్చుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

- చిరుతానిపాడులో కిలోమీటరు దూరం వెళ్తేనే చెలిమ నీరు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



అటవీ ప్రాంతం నుంచి తాగునీరు తెచ్చుకుంటున్న గిరిజనులు

పాల్వంచరూరల్: ఏజెన్సీ ప్రాంతమైన పాల్వంచ మండలం బంజర గ్రామపంచాయతీలోని అటవీ ప్రాంతంలో నివాసం ఉంటున్న రాళ్లచెలక, పెద్దకలస, చిరుతానిపాడు గ్రామంలోని ఆదివాసీ గిరిజన కుటుంబాలు సుమారు 250 మంది జనాభా. వేసవికాలం వచ్చిందంటే ఆయా గ్రామాల్లో తాగునీటి కోసం తల్లడిల్లుతారు. కనీసం ఒక్క బోరు కూడా లేకపోవడంతో వాగులు, వంకల్లో చెలిమ నీటిని తెచ్చుకుని తాగుతున్నారు. కిలోమీటరు దూరం కాలినడకన వెళ్లి కావడ్లు, బిందెల మీద బిందెలు, బుర్రల్లో తాగునీటిని తెచ్చుకుంటూ అవసరాలు తీర్చుకుంటున్నారు. ఆ చెలిమల్లో ఊట కూడా సక్రమంగా రాకపోవడంతో ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతున్న పరిస్థితి. పంచాయతీ గానీ, సంబంధిత అధికారులు కానీ పట్టించుకోకపోవడంతో తాగునీటి కోసం అవస్థలు పడాల్సి వస్తోందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు సౌకర్యం లేని కారణంగా పెళ్లిళ్లను కూడా వర్షాలు కురిసిన తర్వాత చెరువులు, కుంటలు, బావుల్లో నీళ్లు వచ్చిన తర్వాత జరుపుతామని స్థానికులు తెలిపారు.



చెలిమ నీటిని తోడుకుంటున్న దృశ్యం

తాగునీరు అందించాలి



ప్రతి సంవత్సరం వేసవికాలంలో తాగునీరు లభించక నిత్యం అవస్థలు పడుతున్నాం. గ్రామంలో కనీసం ఒక్క బోరు కూడా లేదు. కిలోమీటరు దూరం కాలినడకన వెళ్లి నీళ్లు తెచ్చుకుంటూ ఇబ్బందులు పడుతున్నాం. ప్రజాప్రతినిధులు తాగునీటిని అందించి ఆదుకోవాలి.

– పద్దం భీమా, చిరుతానిపాడు

ఎవరూ పట్టించుకోవడం లేదు



తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న గిరిజనులను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రతిరోజూ తాగునీటికి ఇబ్బంది పడుతున్నాం. చెలిమలో నీరు కూడా సక్రమంగా ఊరడం లేదు. దీంతో తాగునీటికి నిత్యం అవస్థలు పడుతున్నాం.

– మడి సునిత, చిరుతానిపాడు

అటవీశాఖ అనుమతులు లేవు



చిరుతానిపాడు, రాళ్లచెలక, పెద్దకలస ఆదివాసీ గూడాలు అటవీ ప్రాంతంలో దూరంగా ఉన్నాయి. అధికారికంగా తాగునీటి పైపులైన్ నిర్మాణానికి, బోరు నిర్మాణం చేయాలంటే అటవీ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీంతో మిషన్ భగీరథ నీళ్లు ఇవ్వలేకపోతున్నాం.

– నీలావతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

ప్రీతి ఆత్మహత్యపై విచారణ జరిపించాలి



కొత్తగూడెంఅర్బన్: నినాదాలు చేస్తున్న నాయకులు



టేకులపల్లి: మాట్లాడుతున్న కళావతి

టేకులపల్లి: కాకతీయ మెడికల్ కాలేజీ మెడికో డాక్టర్ ప్రీతి ఆత్మహత్య ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) జిల్లా గౌరవ అధ్యక్షురాలు నోముల కళావతి, జిల్లా కార్యదర్శి బయ్యా శారద డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో జరిగిన సంఘం జిల్లా సమావేశంలో వారు మాట్లాడారు. వేధింపుల వల్లనే మెడికో ప్రీతి ఆత్మహత్యకు పాల్పడిందని, కాలేజీ యాజమాన్యం స్పందించి చర్యలు తీసుకుని ఉంటే ప్రీతి సజీవంగా ఉండేదన్నారు. ప్రీతి ఆత్మహత్యకు కారకుడని భావిస్తున్న సీనియర్ విద్యార్థి సైఫ్‌ని హత్యానేరం కింద అరెస్టు చేయాలని కోరారు. దేశంలో, రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని పసిపిల్లలు మొదలు పండు వృద్ధుల వరకు లైంగిక దాడులు చేస్తున్నారని, అధికార పార్టీ నేతల అండదండలతో హంతకులు రక్షించబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రీతి లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇంటిక లక్ష్మి, మోకాళ్ల సుగుణ, చింత లాలమ్మ పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: కాకతీయ మెడికల్ కాలేజీలో మెడిసిన్ చదువుతూ వేధింపులకు గురై ఆత్మహత్యకు పాల్పడిన ప్రీతి నాయక్ మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ప్రీతి ఆత్మకు శాంతి కలగాలని కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ వద్ద తెలంగాణ అమర వీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడారు. గంధం మల్లికార్జున రావు, రాయరాకుల శివశంకర్ పాల్గొన్నారు.

క్రీడలు ఐకమత్యాన్ని ప్రతిబింబిస్తాయి..



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: క్రీడలు ఐకమత్యాన్ని ప్రతిబింబిస్తాయని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. మండలంలోని మామిడిగుండాల గ్రామపంచాయతీ మేడికుంట గ్రామంలో యువత నిర్వహిస్తున్న ఏడు మండలాల స్థాయి వాలీబాల్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. మాట్లాడుతూ.. గ్రామాలలో వాలీబాల్ పట్ల యువత ఆసక్తి కనబరుస్తూ ఇల్లెందు ఏజెన్సీ నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించడం ఆనందంగా ఉందన్నారు. యువతను ప్రోత్సహించేందుకు ఇప్పటికే పలు గ్రామాలలో వాలీబాల్ కిట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో మరింత సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను తిలకించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పాయం స్వాతి, తాటి చుక్కమ్మ, పోలబోయిన వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు మండల రాము, తాటి యశోధ, పాయం కృష్ణప్రసాద్, ఉపసర్పంచ్ తాటి రాంబాబు, ముక్తి కృష్ణ, తాటి బిక్షం, మడుగు సాంబమూర్తి పాల్గొన్నారు.

టైలర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



జెండా ఆవిష్కరణలో టైలర్లు

పాల్వంచ: టైలర్ వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న వారిని జీవన పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని పలువురు టైలర్స్ అసోసియేషన్ నాయకులు అన్నారు. మంగళవారం టైలర్స్ డే పురస్కరించుకుని స్థానిక మీ సేవా సెంటర్‌లో మిషన్‌ను కనుగొన్న విలియమ్స్ హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా రెడీమేడ్ దుస్తులు మార్కెట్‌లోకి వస్తుండటం, ఆన్‌లైన్ వ్యాపారాల వల్ల టైలరింగ్‌కు గిరాకీ తగ్గిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. టైలర్లు వెంకటేశ్వరరావు, శంకర్ రావు, మీరా, పాషా, రహీం పాల్గొన్నారు.

మహిళా పోరాట దినోత్సవాన్ని జయప్రదం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పీఓడబ్ల్యూ కార్యకర్తలు

ఇల్లెందురూరల్: మార్చి8న అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని పీఓడబ్ల్యూ జిల్లా సహాయ కార్యదర్శి మోకాళ్ల సుగుణ పిలుపునిచ్చారు. మండలంలోని కొల్లాపురం గ్రామంలో మంగళవారం ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో లైంగిక దాడులు, పరువు హత్యలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీన వైఖరివల్లే ఇలాంటి సంఘటనలు పెచ్చుమీరుతున్నాయని విమర్శించారు. విజయ, సమ్మక్క, కృష్ణవేణి, అమల, సరోజిని, శ్రావణి పాల్గొన్నారు.

చెత్తపై పన్ను అన్యాయం

ఇల్లెందు: మున్సిపాలిటీ పరిధిలో చెత్తపై పన్ను వేయడం అన్యాయమని టీడీపీ నాయకుడు ముద్రగడ వంశీ అన్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌కు మంగళవారం ఆయన వినతిపత్రం అందజేశారు. వార్డులలో రోజువారీ చెత్త సేకరిస్తున్న సిబ్బంది ప్రజల నుంచి నెలకు రూ.50 వసూలు చేస్తున్నారని, ఈపద్ధతిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రమేష్‌బాబు, నర్సయ్య, శ్యామ్, రవి, రత్నాకర్, వినీత్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌లకు వేలంపాట

కొత్తగూడెంఅర్బన్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో మంగళవారం గతంలో పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలకు వేలంపాట నిర్వహించారు. హీరో గ్లామర్ బైక్‌ను గుగులోత్ కిషన్ రూ.23,500, హోండా యాక్టీవా లక్ష్మీనారాయణ రూ.35,500 వేలంపాటలో దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

హామీలను అమలు చేస్తున్నాం..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

కొత్తగూడెంఅర్బన్: ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో కొత్తగూడెం నియోజకవర్గ రూపురేఖలు మారుస్తూ, దశల వారీగా ఎన్నికల హామీలను అమలు చేస్తున్నానని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 16, 22 వార్డుల్లో సుమారు రూ.50 లక్షల ఊర్దూఘర్ బిల్డింగ్‌లో లైబ్రరీ నిర్మాణం, గొల్లగూడెంలోని శ్మశానవాటికలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో వనమా రాఘవేందర్ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కమిషనర్ రఘు, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, సొసైటీ చైర్మన్ మండే హనుమంతరావు, ఉర్దూఘర్ కమిటీ చైర్మన్ అన్వర్‌పాషా, కౌన్సిలర్లు జయంతిమసూద్, ధర్మరాజు, రుక్మాంగధర్ బండారి, మాచర్ల రాజకుమారి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీలో మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అధ్యక్షతన ఎజెండాలోని ఆరు అంశాలపై సమావేశం జరిగింది. తొలుత కొత్తగూడెం మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు రూ.113 కోట్లు మంజూరు చేయించినందుకు కౌన్సిల్ కృతజ్ఞతలు తెలిపింది. అనంతరం ఎజెండాలోని అంశాలపై చర్చిస్తూ పట్టణంలోని 36 వార్డుల్లో అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాల్లో పార్కుల ఏర్పాటుపై చర్చించారు. దీంతోపాటు డ్రెయినేజీల మరమ్మతులకు రూ.30 లక్షలు పట్టణ ప్రగతి నిధులను ఖర్చు చేయుటకు, కొన్ని ప్రాంతాలలో మొక్కలను నాటుటకు రూ.30 లక్షలు, వార్డుల్లో చేతి పంపులు రిపేర్ చేయుటకు, కొత్తవి ఏర్పాటు చేయడానికి, కిన్నెరసాని పంపు నీటి మోటర్లు రిపేర్ చేయడానికి రూ.97 లక్షలు, సఖీ భవనం ప్రహరీ నిర్మాణానికి రూ.10 లక్షలు, చలివేంద్రాల ఏర్పాటుకు రూ.5 లక్షలు, కార్యాలయ నిర్వహణకు రూ.7.53 లక్షలు కేటాయించి ఖర్చు చేయుటకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్, కమిషనర్ రఘు, డీఈ నవీన్‌కుమార్, మేనేజర్ సత్యనారాయణ, టీపీఎస్ ప్రభాకర్, ఏఈ సాహితి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశం మళ్లీ వాయిదా

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ కౌన్సిల్ అధికార పక్షంలో సయోధ్య కుదరలేదు. అవిశ్వాస నోటీసు అందజేసి 20 రోజుల పాటు క్యాంపు రాజకీయాలు నడిపి కోర్టును ఆశ్రయించి అధిష్టానంతో చర్చించి ఇల్లెందు చేరుకున్న అసమ్మతి కౌన్సిలర్‌లతో ఎమ్మెల్యే హరిప్రియ సమావేశమయ్యారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఇరు వర్గాలతో చర్చించారు. అందరిని ఒకతాటి మీదకు తెచ్చి మీడియా సమక్షంలో అంతా సమసిపోయిందన్నట్లు ప్రకటించాలని భావించినా.. అది కుదరలేదు. ఇరువర్గాలతో కలిపి చర్చించారు. కానీ ఏకాభిప్రాయం సాధ్యం కాలేదు. చైర్మన్ డీవీ, ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వరరావుల మధ్య మాటల యుద్ధం తీవ్రతరం కావడంతో ఇరువర్గాలు అర్థాంతరంగా వెళ్లిపోయారు. ఏడాది కాలంగా తలెత్తిన అంశాలపై చర్చించారు. ఎవరికి వారు సమర్థించుకుంటూ పంతం వీడలేదు. ఇల్లెందు మున్సిపల్ పాలకవర్గంలో 24 మంది సభ్యులు ఉన్నారు. 21 మంది అధికార బీఆర్ఎస్, ముగ్గురు ఎన్డీ, సీపీఐ, బీఆర్ఎస్ రెబల్ సభ్యులు ఉన్నారు. ఇందులో 14 మంది అసమ్మతికి సభ్యులు ఉండగా ఏడుగురు చైర్మన్ పక్షం సభ్యులు ఉన్నారు. కౌన్సిల్ సమావేశం జరగాలంటే కనీసం 8 మంది సభ్యుల ఉంటే కోరం పూర్తవుతుందని అధికార పక్షం అంటుండగా.. అలాంటి జీఓ ఎక్కడ ఉందో చూపాలని అసమ్మతి వర్గం అంటోంది. దీంతో సమావేశాన్ని వాయిదా వేశారు. మరో రెండు మూడు రోజుల్లో నిర్వహించే అవకాశం ఉందంటున్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా జోడో యాత్ర



పాల్వంచ: మాట్లాడుతున్న ఎడవల్లి కృష్ణ

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం పట్టణ పరిధి 1, 2 వార్డుల్లో టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ అధ్వర్యంలో హాథ్ సే హాథ్ అభియాన్ జోడో యాత్ర మంగళవారం పట్టణంలో నిర్వహించారు. గడపగడపకు కాంగ్రెస్ పార్టీ ఔతన్యాన్ని చాటుకుంటూ ప్రజల ఇబ్బందులను తెలుసుకుంటూ పరిష్కరిస్తామని భరోసా ఇస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎడవల్లి కృష్ణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమములో రాయల శాంతయ్య, బొమ్మిడి మల్లికార్జున్, అంతోటి పాల్, పల్లపు వెంకటేశ్వర్లు, కొప్పుల రమేష్, శనగ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ: రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక జయమ్మ కాలనీ నందు స్థానికులను కలిసి భారత్ జోడో యాత్ర కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో నూకల రంగారావు, చారి, రామునాయక్, సత్యనారాయణ, వెంకన్న గౌడ్, వెంకటేశ్వరరావు, భానుతేజ, నాగేశ్వరరావు, హరిప్రసాద్, కమలాకర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బతుకులు మారాలంటే బీజేపీ రావాలి



ఇల్లెందు: మాట్లాడుతున్న ఉదయ్‌ప్రతాప్

ఇల్లెందు: పేదల బతుకులు మారాలంటే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు సన్నె ఉదయ ప్రతాప్ అన్నారు. మంగళవారం రాత్రి పట్టణంలోని జగదాంబా సెంటర్‌లో ప్రజాగోస – బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. దేశంలో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశాన్ని అన్ని రంగాల్లో ప్రపంచ దేశాల సరసన నిలిపాడన్నారు. బీజేపీలో ప్రతీ కార్యకర్త దేశ సేవకు తొలి ప్రాధాన్యం ఇస్తారని తెలంగాణలో బీఆర్ఎస్ నేతలు తమ స్వలాభం కోసం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. నాళ్ల సోమసుందర్, జి.రాంచందర్‌నాయక్, మిర్యాల వెంకటేశ్వర్లు, ఖాజాపాషా పాల్గొన్నారు.

టేకులపల్లి: బీజేపీ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని, సంక్షేమ పథకాలు అమలు జరుగుతాయని ప్రజా గోస బీజేపీ భరోసా స్పీకర్, ఇల్లెందు నియోజకవర్గ కోఆర్డినేటర్ వాంకుడోత్ హత్తీరాంనాయక్, బీజేపీ మండల అధ్యక్షుడు దారావత్ బాలాజీ నాయక్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని సులానగర్‌లో బూత్ లెవెల్ భరోసా కార్నల్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, ఆవాస్ యోజన ఇంటి పథకం, ముద్ర రుణాలు, సుకన్య సమృద్ధి యోజన పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శిగా చిలకబత్తిని రాహుల్‌ని నియమించారు. పలువురు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బాల, మల్లయ్య, వీరమ్మ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

కూలిన చెట్టును తొలగించండి..

ఏడాది క్రితం భారీవర్షాలకు రోడ్డుపై అడ్డంగా నేలకూలిన భారీ వృక్షాన్ని నేటికీ తొలగించకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో కొత్తగూడెం మున్సిపల్ పంపుహౌజ్‌కు వెళ్లే రహదారిలోఉన్న భారీ రావి చెట్టు కూకటివేళ్లతో నేలకూలింది. ఈ చెట్టు ఎక్కువభాగం ప్రధాన రహదారిపై పడింది. దీంతో నిత్యం వచ్చిపోయే పర్యాటకులు ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు, గ్రామపంచాయతీ సర్పంచ్ చెట్టును తొలగించాలని పర్యాటకులు కోరుతున్నారు. - పాల్వంచరూరల్



ప్రశ్నించాల్సిన అధికారి : వంశీ, ఆర్‌అండ్‌బీ ఏఈ
సెల్ నంబర్ : 9603465426

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



పాల్వంచ: సైన్స్ ప్రదర్శలు ఇస్తున్న శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు

కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో మంగళవారం ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు తయారు చేసిన సైన్స్ పరికరాలు ప్రదర్శించారు. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. విద్యార్థులు శాస్త్రీయ అవగాహనను పెంపొందించుకోవాన్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందు: వ్యాసరచన పోటీలలో విద్యార్థులు



కొత్తగూడెంరూరల్: చాతకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..



ఇల్లెందు: ఎంఆర్‌జీ నారాయణ స్కూల్‌లో..



కొత్తగూడెంఅర్బన్: సింగరేణి పాఠశాలలో...



పాల్వంచ: వికలాంగుల కాలనీ పాఠశాలలో...



ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ



పాల్వంచ: కేటీపీఎస్ డీఏవీ పాఠశాలలో..